# నీ రెండలు

సాయంకాలం ఆకాశం రకరకాల రంగుల్తో అలంకరించుకుంటుంది. సోమరిగా కదుల్తున్న మబ్బుముక్కలు క్షణక్షణానికి ఆకారాలు మార్చు కుని తేలిపోతున్నాయి. వాటివంక అలాగే చూస్తూ ఆలోచిస్తున్న పార్వతి మనసులోను ఎన్నోరకాల రంగుల ఆలోచనలు రూపు చేసుకుంటున్నాయి. విడిపోతున్నాయి.

సుమారు యిరవై యేళ్ళ క్రితంనాటి మాట.

అప్పట్లో పార్వతి యూనివర్సిటీలో చదువుతుండేది. క్లాసు నాలుగు గోడల మధ్య చదువుకున్న విజ్ఞానమే కాక యింకా ఎన్నోచూసి, చదివి, ఆలోచించి మనసుని వికసింప చేసుకుంటున్న మధుర క్షణాలవి. చదువుకోవాలి యింక పైనేం లేదన్నంతవరకు చదువుకుని ఒకరి అధికా రానికి తలొగ్గకుండా స్వేచ్ఛగా సంపాదించుకుని జీవితం ఆదర్శవంతం చేసుకోవాలి మామూలు ప్రతి ఆడదానిలాగ యెవరికో ముడిపడి, పిల్లల్ని కని, వాళ్ళ రోగాలు, ఏడ్పులు, వంటల్లో సతమతమవుతూ, మరొకరి కోసం తనని బలి పెట్టుకుని రోజులు నెట్టేయడం అంటే చెప్పలేని భయం

అసహ్యం! .. యీ గాడిలో పడి అందర్లాగా యెటో చావు వెతుక్కుంటూ కొట్టుకుపోకుండా, పూర్తిగా తనకోసం తను, తనకి యిష్టంవచ్చిన విధంగా బ్రతకాలని ఆమె అప్పట్లో నిశ్చయించుకుంది.

ఆ నిశ్చయం ఎవరెన్ని విధాల నచ్చచెప్పినా సడలలేదు. తల్లీ, తండ్రీ, అన్నలు అందరూ ఎన్నో విధాల హితబోధలు చేశారు. ఆఖరి సారి యింట్లో పెద్దరభస జరిగింది. ఎన్నో సంబంధాలు చూడకుండానే తిరస్కరించింది. ఆఖరిసారి ఆమెకు తెలియకుండా పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు యిష్టంలేకపోయినా కూర్చోక తప్పలేదు. అప్పుడే తన నిశ్చయాలను బయటపెట్టింది. యింట్లో అందరూ అనేక విధాల నచ్చచెప్పబోయారు.

"యింతమంచి సంబంధం తప్పుచేసినా మళ్ళీదొరకదు. పదిహేను వందల జీతం. విదేశాలు వెళ్ళివచ్చాడు, వినయం, విధేయత, సంస్కృతి సంస్కారము ఉన్నవాడు. అందగాడు, ఆస్తిపరుడు. అన్నిటిని మించి నువ్వంటె చాల యిష్టపడ్డాడు. నీ వెందుకింత మూర్ఖంగా అతన్ని తిరస్కరిస్తున్నావో మాకు అర్థం అవడంలేదు." అన్నయ్య కోప్పడ్డాడు.

"వద్దంటున్నకొద్దీ దాన్నిలా డిగ్రీలమీద డిగ్రీలు చదివించారు. దాన్ని యిలా నెత్తినెక్కించుకున్నారు. యింక యిప్పుడది మనమాట వింటుందా!" అమ్మ విసుక్కుంది.

"బాగా ఆలోచించు తల్లీ చదువుకున్న దానివి. పెళ్ళి కాకుండా యెన్నాళ్ళుంటావు! నిన్ను కన్నందుకు మా బాధ్యత మేము నెరవేర్చాలి గదా! నీకు పెళ్ళి చెయ్యకుండా ఎన్నాళ్ళు చూస్తూ వూరుకుంటాం?" నాన్న బ్రతిమిలాడాడు.

"పెళ్ళిచేసుకోకుండా ఎమ్మెస్సీ, డియస్సీ అయి విదేశాలు తిరిగొచ్చి యింకా పరిశోధించి, కనిపెట్టి, పేరుపొంది నోబుల్ ప్రైజు కొట్టేసి, యింక ఆ తర్వాత ఏం చేస్తావు." చిన్నన్నయ్య వేళాకోళం.

యెన్ని హితోపదేశాలు, మందలింపులు, వెక్కిరింపులు, అనునయాలు, కోపాలు ఆగ్రహాలని ఎదుర్కోవలసి వచ్చిందో ఆనాడు పైకి చదవాలన్న తన కోరిక నెరవేర్చుకోడానికి। మొత్తానికి ఎలాగైతేనేం, అన్ని అవరోధాలనీ దాటి తన ఆదర్శం చేరుకోగలిగింది. తన ఆశయం నెరవేర్చుకోగలిగింది.

ఈ దేశంలో ఒక డాక్టరేట్, విదేశాలలో ఒక డాక్టరేట్ పొందింది। తిరిగివచ్చాక మొదట్లోనే పెద్దజీతంతో మొదలై యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేస్తూంది. కాలేజీలో యెంతో పేరు. ఆమె అంతమేధావి. ఆమెలాగ అతిసూక్ష్మంగా వివేచించి వ్యక్తం చెయ్యగలవారు లేరంటారు. యెన్నో పుస్తకాలు చదువుతుంది. సబ్జక్టుమీదనేగాక యింకా యేవేవో యితర విషయాలమీద జ్ఞానాన్ని అన్వేషించాలని, అర్జించాలని ఆమెకున్న తృష్ణ యెప్పటికప్పుడు ఏదో అసంతృప్తిని, వెలితిని చూపెడుతూనే వున్నది.

నగరంలో అందమైనచోట ఓ అందమైన బంగళాలో ఆమె మకాం. వంటకి మనిషి, పనులకి నౌకరు. తోటకి మాలి చిన్నకారు-అన్ని సదుపాయా లున్నాయి. కాలక్షేపానికి అన్న కూతురు ప్రమీల వుంది. ఆమె పనిచేసే కాలేజీలో చదువుతూంది: చలాకీగా వుంటుంది. మంచి మాటకారి. పార్వతికి మనసు సరిగాలేనపుడు ప్రమీలతో కాసేపు కబుర్లు చెపితేచాలు ఆమె ఉల్లాసం యీమెలోనూ అంటువ్యాధిలాగ వ్యాపిస్తుంది.

ప్రమీలని పార్వతి వద్దకి పంపడానికి ఆమె తండ్రి చాలా సంశయించాడు. వివాహం ఆడదానికి కాళ్ళకి సంకెళ్ళు వేస్తుందనీ, అనవసరమైన వ్యాపకం అనీ వాదించి పెళ్లిమానేసిన పార్వతి, ప్రమీల మెదడులో ఆ బీజాలే నాటుతుందని ఆయన భయం. కాని ప్రమీల యిష్టంవల్లా

పార్వతి వత్తిడివల్లా, అంతకుమించి ప్రమీలని వంటరిగా వేరేచోట ఉంచడం యిష్టంలేకా అక్కడికే పంపాల్సి వచ్చింది.

పార్వతి అలా సాయంకాలాలు ఆరుబయట కూర్చుని నీరెండల్లోకి చూస్తుంటే యేమేమిటో ఆలోచనలు వస్తాయి. యీమధ్య కొన్ని కొన్ని సమయాలలో యేదో అసంతృప్తి పూర్తిగా కృంగదీస్తుంది ఆమెను.

ఆ సాయంకాలమూ అంతే. అలా కూర్చుని పైకి చూస్తుంటే రోజూ అవేపుస్తకాలు, పాఠాలు, విద్యార్థులు, పరీక్షలు, అదేకాలేజి అన్నీ యేమిటో గుర్తుకొచ్చి మనసు కలతపడింది. జీవితంలో స్తబ్దతని, నిశ్చలతని ద్వేషించిన తనుకూడ ఆఖరికి ఒక గాడిలోకి ప్రవేశించింది. బ్రతుకు యిలా ముగియవలసినదేనా? నవ్యత నాశించిన ఆమెకి యీ బ్రతుకూ విసుగు కలిగించింది. ఆమె ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి.

గేటు తీసుకుని ప్రమీల లోపలికి వచ్చింది. ప్రక్కన లాన్లో పార్వతి వంక చూడకుండానే యేదో ఆలోచనలో పడి హడావిడిగా లోపలికి వెళ్ళింది. పుస్తకాలు టేబిల్ పైకి గిరాటేసి బట్టలైనా మార్చకుండా పుస్తకాల మధ్యనుంచి ఓ ఉత్తరం తీసి అదేపనిగా చదివింది చాలాసేపు. చివరికి చీకటి గదిలో అలా ఉత్తరం పట్టుకుని అలా ఆలోచించుకుంటూ కూర్చుంది.

"చీకట్లో కూర్చున్నావేం ప్రమీల. లైటు వేసుకోక పోయావా?" పార్వతి గదిలోకివచ్చి లైటు వేసింది.

ప్రమీల ఉలిక్కిపడి లేచి గాబరాగా ఉత్తరం దాచి మౌనంగా టవలు తీసుకుని బయటికి వెళ్ళిపోయింది.

పెనుగాలిలా ఉరుకులు వేసే ప్రమీల అలా నెమ్మదిగా, నిబ్బరంతో హుందాగా నడిచి వెళ్ళడం, అంతకుమించి ఏదో ఆలోచనలో పడ్డం

పార్వతికి ఆశ్చర్యంగా వుంది. ప్రమీలకి దేవుడు హృదయమే గాని మెదడు యివ్వలేదనుకునేది చాలాసార్లు. అలాంటిది యీ రోజు ప్రమీలలో మార్పుకి కారణం ఏమిటో?

ఆ తర్వాత మార్పుకి కారణాలు అన్వేషించడమే ఆమె కొక ముఖ్యమైన పనయింది. ప్రమీల క్రమంగా చాల మారింది, యెప్పుడూ పదిమందిని చుట్టూ చేరేసి నవ్వుల్తో, కేరింతల్తో ఉప్పెనలాచెలరేగే ప్రమీల క్రమేపి స్నేహితులని వదిలపెట్టింది.

యెప్పుడూ ఒక్కతే కూర్చుంటుంది. అప్పుడప్పుడు ఏదో వ్రాస్తుం టుంది. లేకపోతే అలా యెక్కడికో ఏ అర్థమూ చెప్పని చూపులు చూస్తూవుంటుంది.

ఓ సాయంకాలం తొందరగా యింటికివచ్చి కూర్చున్నారిద్దరూ. సినిమాకి వెడదామని ప్రతిపాదించింది ప్రమీల ఏమంటుందో చూడాలని తను యిష్టంలేదంది పార్వతి. కావాలంటే ప్రమీలని ఒక్కతినే వెళ్ళమంది. మామూలుగా అయితే పార్వతి కదిలిందాకా వేధించుకు తినేది ప్రమీల. కాని ఆరోజు "సరే, అయితే" అని యింకేం అనకుండా వెళ్ళిపోయింది. అది పార్వతికొక కనువిప్పు.

మరో సాయంకాలం భోజనాలవేళ. కంచం ముందు కలిపినదే కలు పుతూ అలా మూగగా ఆలోచిస్తూ తనలో తను నవ్వుకుంటున్న ప్రమీలని చూస్తుంటే పార్వతికి నవ్వు, కోపం, చిరాకు అదేమిటో తెలుసుకోవాలన్న ఉత్సుకత యిలాంటివెన్నో చాలా వచ్చాయి.

"యెందుకే అలా నీలోనువ్వే నవ్వుకుంటున్నావు?"

"యేం లేదత్తయ్యా"

"యేమీ లేకుండా నవ్వుకోడానికి నీకేం పిచ్చా ఏమిటి ?"

"కాదు, యేదో గుర్తువచ్చింది.

"ఆ యేదో యేమిటో నాతో చెప్పగూడదూ ?"

"అబ్బ అన్నీ ప్రశ్నలే. నీకన్నీ కావాలి ! యేంలేదంటే యేం చెప్పను !" విసుగు, గారం మిలాయించి మాట మార్చింది ప్రమీల.

అప్పట్నించి పార్వతి ప్రమీలమీద యించుమించు గూఢచర్యం సాగించింది. ఆమె మాటల్లో, మౌనంలో లేని అర్థాలు యెన్నో వెతక సాగింది. ఆమె కళ్ళలోకి పరిశీలనగా చూసేది. ఉత్సుకత, ఉత్కంఠ మాత్రమే కాకుండా యేదో భయంకూడ ఆమెలో ప్రవేశించింది.

ఆరోజు కాలేజీలో వక్తృత్వపు పోటీలు ! వార్షికోత్సవ సందర్భంగా జరిగే వారంరోజుల్లోనూ ఆరోజు కట్టకడపటిది, అతిముఖ్యమైనది. అన్ని కాలేజీలనించి విద్యార్థులు పాల్గొంటారు.

పార్వతికన్నా ముందుగానే అక్కడికి వచ్చి ముందు కుర్చీల్లో కూర్చుంది ప్రమీల. పోటీలన్న పేరేగాని యించుమించు తుదినిర్ణయం అందరికీ ముందుగా తెలిసినదే. కృష్ణమూర్తి అన్ని కాలేజీల్లోనూ అంతకు ముందు ఉత్తమ వక్త అనిపించుకున్నాడు. అతను ఫైనల్ ఎం. ఏ. పచ్చగా, సన్నగా బాగుంటాడు. చక్కని శైలి. వినాలనిపించే కంఠం. అంతకంటే అతను యేవిషయంపైనైనా మాట్లాడే ముందు యెంతో చదివి, తెలుసుకునిగాని రాడు. అంచేత అతనుచెప్పే చాలా విషయాలు మిగతా వాళ్ళ కందకుండా పోయేవి.

ఆ యేడు విజేత కృష్ణమూర్తి.

చాలరోజుల్నించి చూడని వెల్లువలాంటి ఉత్సాహం, ఉల్లాసం ప్రమీలలో ఆరోజు కృష్ణమూర్తిని అభినందిస్తున్నప్పుడు చూసింది పార్వతి. దూరాన్నించి వాళ్ళిద్దరూ ఒకర్నొకరు చూసి నవ్వుకుంటూ మాట్లాడు కుంటూ నడవడం చూశాక పార్వతికి చాలవరకు అర్థమయింది. వాళ్ళి ద్దరూ అలా కాంటిన్‌లోకి మాయమైనాక, పార్వతి యింటికి చేరుకుంది వంటరిగా.

ఆ తరువాత వారంరోజులలో కృష్ణమూర్తి గురించిన వివరాలుఅన్నీ సేకరించింది పార్వతి. స్వయంగా అతనితో మాట్లాడింది. చివరకు ఓ నిర్ణయానికి వచ్చింది. అన్నగారికి ఉత్తరం వ్రాసింది.

అన్నయ్యకి

చాలరోజుల తర్వాత ఉత్తరం వ్రాస్తున్నాను. వ్రాయల్సిందేం కనపడక యింతకాలం వ్రాయలేదు. ప్రమీల కులాసాగా వుంది. బాగా చదువుతూంది. తప్పకుండా క్లాసే రావచ్చు.

అసలు యీ ఉత్తరం రాయడానికి కారణం ప్రమీలకి యింక చదువయిపోయినట్టే లెక్క. అది రిసెర్చికి వెళ్తుందనిగానీ, పంపించాలని నీ ఉద్దేశం అనిగానీ అనుకోను. దానికి పైచదువులమీద మోజులేదు. నాకూ యింక యీ చదువు చాలనిపిస్తూంది. అంచేత యింక పెళ్లిగురించి ఆలోచించడం మంచిదని ఉద్దేశం.

ప్రమీలకి తగిన సంబంధం ఒకటి చూశాను కృష్ణమూర్తి బాగుంటాడు. తెలివైనవాడు. డబ్బుంది. ఇంకా చాలపైకి వెళ్ళే లక్షణాలున్నాయి. అన్నివిధాల ప్రమీలకి తగినవాడు. అందుకు నీవేం సందేహించనక్కరలేదు.

అన్నింటికన్నా ముఖ్యం వాళ్లిద్దరూ ఒకర్నొకరు యెంచుకొని యిష్టపడ్డారు. ప్రమీల సుఖంకన్నా మనకు కావల్సిందేముంది? అంచేత యింక యేఅడ్డు చెప్పకుండా యీ వేసవిలోనే యీ పెళ్ళి జరిపిస్తావని ఆశిస్తాను. నీవు అతన్ని చూడాలనుకుంటే యిక్కడికి రా? వాళ్ళ పెద్దవారితోకూడ మాట్లాడి నిశ్చయించుకోవచ్చు.

—పార్వతి"

ఉత్తరం పోస్టుకి పంపాక కిటికీ దగ్గర నిలబడి బయటికి నీరెండలోకి చూస్తోంది పార్వతి.

ఈ యిరవై ఏళ్ళలో తన అభిప్రాయా లెలా మారాయో, అలాగే మారుతున్నాయి ఆకాశం రంగులు. అప్పుడంత నిశ్చలమనుకున్న తన మనోభిప్రాయాలు యీనాడు యిలా ఆమెని కలవరపెడుతున్నాయి. ఆమె జీవితంలో యెంతో నష్టపోయింది. కాని ఆ నిజం ఆమె చాల ఆలస్యంగా గుర్తించింది. తను పోగొట్టుకున్నదాని విలువ ఏమిటో చాలా ఆలస్యంగా తెలిసింది ఆమెకి. అనుకోకుండా ఆమె కళ్ళలో నీరు తిరిగింది.

"ఎందుకత్తా! నీ కళ్ళలో నీళ్ళు! ఏమిటయింది?" అప్పుడే వచ్చిన ప్రమీల ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"ఏంలేదు" చప్పున వెనక్కి-తిరిగి కళ్ళు తుడుచుకొంది పార్వతి.

"కాదు, చెప్పాలి. ఏం అయిందత్తా" ఆత్రంగా అడిగింది ప్రమీల,

"పో కోంటుపిల్లా! ఆరోజు నువ్వెందుకు నవ్వుకున్నావో చెప్పావా? యీరోజు నేనెందుకు యేడుస్తున్నానో చెప్పడానికి!" లేనినవ్వు తెచ్చుకుని హాస్యమాడబోయింది పార్వతి.

ఆ కన్నీళ్ళు ఆమె హృదయంలో గూడుకట్టుకున్న బాధకి ప్రతిరూపాలని, ఆమె ఓటమిని ప్రకటించే సాక్షులని ప్రమీలకి తెలియదు.

—o—